https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 56 ఆదివారం 28-06-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# స్పీడు పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు

**ఫలితాల సాధనకు ఇక రెండేళ్లే సమయం**

**చివరి ఆరు నెలలంతా ఎన్నికల హడావుడే**

**భారీ మార్పులు చేపడుతున్న సీఎం రేవంత్**

**సమర్థులైన అధికారులకు పాలనా పగ్గాలు**

**హైదరాబాద్, జూన్ 27 మీడియా టుడే**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గేరు మార్చి.. స్పీడు పెంచబోతోంది. పాలనను టాప్‌గేర్‌లో పెట్టబోతోంది. ప్రతిపక్షాల విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా, ప్రజలకు మరింత దగ్గరయ్యేలా వ్యూహరచన చేస్తోంది. తాను చేపట్టిన ప్రతిష్ఠాత్మక పథకాలకు పూర్తి స్థాయి ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికి రెండున్నరేళ్లు పూర్తయింది. ఎన్నికలకు ఇంకా మిగిలింది మరో రెండున్నరేళ్లే. చివరి ఆరు నెలల్లో అంతా ఎన్నికల హడావుడే ఉంటుంది. అంటే.. ప్రభుత్వం తాను తలచింది చేయాలన్నా, చేసింది చెప్పాలన్నా, వచ్చే ఎన్నికల కోసం సిద్ధం కావాలన్నా.. రెండేళ్లలోనే చేయాలి. దీంతో ఈ రెండేళ్ల సమయం రేవంత్ సర్కారుకు అత్యంత కీలక దశ కానుంది. చేపట్టిన పథకాలకు పూర్తి స్థాయి ఫలితాలు రాబట్టాల్సిన అనివార్యత ఏర్పడింది. ఇందుకోసం సమర్థ అధికార యంత్రాంగం అవసరమని భావించిన సర్కారు శుక్రవారం భారీ మార్పులు చేసింది. పథకాల అమలులో సమర్థుడైన ఐఏఎస్ సంజయ్ జాజును సీఎస్‌గా నియమించింది. సీఎంవోలోనూ మార్పులు చేసింది. జూలై మొదటి పక్షంలో



మరిన్ని మార్పులు చేసే ఆలోచనలో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం పలు దీర్ఘకాలిక ప్రాజెక్టులను ప్రారంభించింది. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టును గాడిలో పెట్టే దిశగా చర్యలు చేపడుతోంది. దీనికి అవసరమైన కేంద్ర రక్షణ శాఖ భూములపై అనుమతులు సాధించింది. ప్రాజెక్టు కోసం అప్పు సాధించడమే మిగిలి ఉంది. కేంద్రం నుంచి ఎలాంటి నిధులు వచ్చే సూచనలు కనిపించకపోవడంతో ప్రభుత్వమే సొంతంగా ప్రాజెక్టు చేపట్టేలా కసరత్తు చేస్తోంది. దీనికి భారీ రుణం తీసుకునే దశగా చర్యలు చేపట్టింది. ఇలాంటి ప్రాజెక్టు సాకారమైతే... జీహెచ్ఎంసీ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అనుకూల ఫలితాలు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అందుకే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై ఎన్ని అవాంతరాలు వచ్చినా, ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనా ముందుకే వెళ్లాలని నిర్ణయించింది. అలాగే, ఒక్కో నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభు త్వం నిర్మిస్తోంది. ఇది కూడా రేవంత్ సర్కారు డ్రీమ్ ప్రాజెక్ట్. ఒకే స్కూలు ఆవరణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులంతా ఉండేలా ప్రాజెక్టును తీర్చిదిద్దడం వల్ల అన్ని వర్గాల మనసులను చూరగొనవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. అందుకే ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేస్తోంది.

మిగతా 2లో...

## తమిళనాడు కాంగ్రెస్‌కు కొత్త సారథి..

- పీసీసీ అధ్యక్షుడిగా మాణిక్యం ఠాగూర్
- వెంటనే అమల్లోకి నియామకం
- పార్టీ బలోపేతమే లక్ష్యం



**చెన్నై, జూన్ 27**

తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌పీసీసీ) అధ్యక్షుడిగా లోక్‌సభ సభ్యుడు బి. మాణిక్యం ఠాగూర్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించి ంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో ఈ నియామకాన్ని వెంటనే అమల్లోకి తీసుకొచ్చినట్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధికారికంగా ప్రకటించి ంది. మాణిక్యం ఠాగూర్ ప్రస్తుతం విరుధునగర్ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, అండ మాన్-నికోబార్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా, లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ విప్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ఆయనకు ఉన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ బాధ్యతలు అప్పగించినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నియామకంతో ఇప్పటి వరకు తమిళనాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కె. సెల్వపెరుంతగై స్థానంలో మాణిక్యం ఠాగూర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. పార్టీ కోసం ఆయన అందించిన సేవలను కాంగ్రెస్ అధిష్ఠానం అభినందిస్తూ, కొత్త అధ్యక్షుడికి పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరింది. తమిళనాడులో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, శ్రేణులను సమన్వయం చేయడం, రానున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేలా పార్టీని సిద్ధం చేయడం కొత్త అధ్యక్షుడి ముందున్న ప్రధాన బాధ్యతలుగా భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా త్వరలోనే కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది.

మిగతా 2లో...

## సౌదీ ప్రయాణికులకు కొత్త నిబంధనలు

- డిక్లరేషన్ పరిమితి తగ్గింపు
- బంగారం రవాణాపై కఠిన నిబంధనలు
- ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు



2

## మీ భవిష్యత్తు నా బాధ్యత..

### భూములిచ్చిన మీ త్యాగం వృథా కాదు

**వెలిగొండ నిర్వాసితులకు సీఎం భరోసా**

**మీ స్ఫూర్తితో 23 లక్షల మందికి తాగునీరు**

**4 జిల్లాల్లో 4.47లక్షల ఎకరాలకు సాగునీరు**

**అన్యాయం జరగనీయను.. అండగా ఉంటా**

**ఏ ప్రభుత్వమైతే ఏమిలే అని అనుకోవద్దు**

**వైకుంఠపాళీ ఆడొద్దు**

**గొడ్డలి పార్టీ మాయలో పడొద్దు: చంద్రబాబు**



**మార్కాపురం, జూన్ 27**

'వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం ఒక చరిత్ర. ప్రాజెక్ట్ కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు వదిలేసిన మీ త్యాగం వృథా కాదు. మీ దాతృత్వం వల్ల నాలుగు జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మీ పేరు చెప్పుకొని 23 లక్షల మంది ప్రజలు వెలిగొండ నీళ్లు తాగుతారు. వారి ఆశీస్సులతో మీ అందరి జీవితాలు మెరుగ్గానే ఉంటాయి. మీ భవిష్యత్తుకు అండగా నేనుంటా. మీ అందరి జీవితాల్లో ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత నేనే తీసుకుంటా." అని వెలిగొండ ముంపు గ్రామాల నిర్వాసితులు, రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద శనివారం వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం కింద మొదటి విడత రూ.300 కోట్లు నమూనా చెక్కును సీఎం అందజేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కాలువను పరిశీలించిన ఆయన, అక్కడి పొలాల్లో రైతులు, నిర్వాసితులతో మాట్లాడారు. వెలుగొండకు 1996లో నేనే శంకుస్థాపన చేశా. ఇప్పుడు నేనే పూర్తి చేసుతన్నా. ప్రస్తుత లెక్కల ప్రకారం ప్రాజెక్ట్ పూర్తి కావడానికి రూ.10,580 కోట్లు అవసరం. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో రూ.759 కోట్లు గత రెండేళ్లలోనే ఖర్చు పెట్టాం. ఇప్పుడు నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేశాం. అందులో రూ.300 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. గత వైసీపీ ఐదేళ్లలో కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మేం నిర్వాసితుల కోసమే రూ.905 కోట్లు, నిర్మాణ పనులకు రూ.3వేల కోట్లకు పైగా వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లులను కూడా రూ.140 కోట్లు చెల్లించాం. 2014-19 మధ్య కాలంలోనే చాలా వరకు టన్నెల్ పనులు చేశాం. నిర్వాసితులకు గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. సొరంగాల్లో మట్టిని, రెండో టన్నెల్‌లో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ యంత్రాన్ని కూడా తొలగించలేదు. అవేమీ చేయకుండానే జాతికి అంకితం చేసింది. ఇది డ్రామానో లేక మోసమో మీరే గ్రహించాలి." అని అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్తూ, మనం తేరుకునేలోపే మో సం చేస్తారు. ఇటీవల అక్కడక్కడా జరుగుతున్న డిజిటల్...

మిగతా 2లో...

## జోనాథన్‌తో మోదీ ఆత్మీయ క్షణాలు

- సెషెల్స్‌లో అరుదైన దృశ్యం
- జోనాథన్‌తో ఆత్మీయ ముచ్చట్లు
- దౌత్య పర్యటనలో ప్రత్యేక ఆకర్షణ

2



## చినుకుల్లోనే ప్రగతి పనులు

- రూ.16.13 కోట్ల శంకుస్థాపనలు
- తండాలకు మెరుగైన రహదారులు- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



## బాలికను బలి తీసిన ట్రక్కు

- మద్యం మత్తులో డ్రైవర్



**రాయ్‌పూర్, జూన్ 27**

ఛత్తీస్‌గఢ్‌లో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ట్రక్కు నడిపిన ఓ డ్రైవర్ 11 ఏళ్ల బాలికను ఢీకొట్టి చంపి, అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అయితే పోలీసులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా దాదాపు 60 కిలోమీటర్ల పాటు వెంబడించి చివరకు మహారాష్ట్ర సరిహద్దు సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రెండు గంటలపాటు సాగిన ఈ ఉత్కంఠభరిత ఛేజింగ్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. మోహ్లా-మాన్‌పూర్-అంబాగఢ్ చౌకీ జిల్లాలోని గుండర్‌దేహి గ్రామం వద్ద రాజ్‌నంద్‌గావ్-మాన్‌పూర్ ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న ట్రక్కు రోడ్డుపై ఉన్న పూనమ్ అనే 11 ఏళ్ల బాలికను బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కును ఆపకుండా డ్రైవర్ వేగంగా అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే జిల్లా వ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించి ట్రక్కు కోసం గాలింపు ప్రారంభించారు. మొదట మోహ్లా పోలీస్ స్టేషన్ వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ట్రక్కును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆగకుండా ఎదురుగా ఉన్న మరో ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టి, పోలీసుల బ్యారికేడ్లను ధ్వంసం చేస్తూ దూసుకెళ్లాడు. వెంటనే వైర్‌లెస్ ద్వారా సమాచారం అందుకున్న ఇతర పోలీసు బృందాలు కూడా అప్రమత్తమై ట్రక్కును వెంబడించాయి.

మిగతా 2లో...

## ఉపాధి చట్టంపై తెలంగాణ పోరు

- కేంద్ర ప్రతిపాదనకు తీవ్ర వ్యతిరేకం
- అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం
- జూలై 2న కేబినెట్ నిర్ణయం



**హైదరాబాద్, జూన్ 27 :**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీ-జీ రామ్-జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రాష్ట్రాల రాజ్యాంగబద్ధ అధికారాలను హరించే ప్రయత్నమని, తెలంగాణ హక్కులకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నీ ప్రభుత్వం ఒప్పుకోదని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమా వేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ ఇది కేవలం ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన సవరణ కాదని, దేశ సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని విమర్శించారు. గ్రామీణాభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను నిర్వీర్యం చేసి అధికారాలను కేంద్రీకరిం చాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆరోపించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చట్టాన్నీ ప్రభుత్వం అమలు చేయబోదని స్పష్టం చేశారు. ప్రతిపాదిత చట్టంలోని పలు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు ఉపసం ఘానికి వివరించారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అవసర మైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కాపా డేందుకు దేశ అత్యున్నత న్యాయస్థా నాన్ని ఆశ్రయించడానికైనా వెనుకాడబోమని పేర్కొన్నారు. తెలంగాణ ఒక్కటే కాకుండా సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేపట్టేందుకు ప్రభు త్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. కర్ణాటక, కేరళ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి ఉమ్మడి న్యాయ, రాజకీయ కార్యాచరణపై చర్చించ నున్నట్లు తెలిపారు. రాష్ట్రాల అధికారా లను కాపాడేందుకు అవసరమైతే సంయుక్తంగా ఉద్యమిం చేందుకు కూడా సిద్ధమని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు అమలు చేయాలని వారు సూచించారని చెప్పారు.

## అఫ్గానిస్థాన్‌లో భూకంపం..

**అఫ్గానిస్థాన్ :**

అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం చోటుచేసుకుంది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదయ్యింది. భారత కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 7:04 గంటల ప్రాంతంలో ఈ భూకంపం వచ్చింది. ఈశాన్య అఫ్గానిస్థాన్‌లోని కలాఫ్‌గాన్‌కు సుమారు 81 కిలోమీటర్ల దూరంలో.. ఫైజాబాద్‌కు దక్షిణంగా 74 కిలోమీటర్ల దూరంలో.. భూమి లోపల 215 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ తెలిపింది. భూకంపం చాలా లోతులో రావడం వల్ల ఉపరితలంపై దాని తీవ్రత తగ్గిందని ఎన్‌సీఎస్ వెల్లడించింది. భూకంపం కారణంగా ప్రాణ నష్టం సంభవించిందా? లేదా? అన్న వివరాలు తెలియరాలేదు.

# జోనాథన్‌తో మోదీ ఆత్మీయ క్షణాలు

- సెషెల్స్‌లో అరుదైన దృశ్యం
- జోనాథన్‌తో ఆత్మీయ ముచ్చట్లు
- దౌత్య పర్యటనలో ప్రత్యేక ఆకర్షణ



**డెస్క్, జూన్ 27**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వయసున్న భూచర జీవిగా గుర్తింపు పొందిన 'జోనాథన్' అనే తాబేలును సందర్శించారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించిన మోదీ, ఈ అరుదైన జీవిని చూసి ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భేటీ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జోనాథన్ సుమారు 194 ఏళ్ల వయస్సు కలిగిన అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు. ప్రపంచంలోనే అత్యంత వయసున్న భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లో స్థానం సంపాదించింది. వయసు పెరగడంతో కంటిచూపు, వాసన శక్తి కొంత తగ్గినప్పటికీ, ప్రస్తుతం ఆరోగ్యంగానే జీవిస్తోందని అధికారులు తెలిపారు.జాతీయ బొటానికల్ గార్డెన్స్‌లో పర్యటించిన ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ఒక మొక్కను కూడా నాటారు. ప్రకృతి సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉందనే సందేశాన్ని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సెషెల్స్ అధికారులు కూడా పాల్గొన్నారు. భారత్–సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవడం వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మోదీ పర్యటన మరింత ప్రత్యేకంగా నిలిచింది. జాతీయ బొటానికల్ గార్డెన్స్‌లో జోనాథన్‌ను సందర్శించడం అక్కడి ప్రజలు, పర్యాటకుల దృష్టిని ఆకర్షించింది. ప్రధాని మోదీ, జోనాథన్ తాబేలు భేటీకి సంబం ధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. అరుదైన ఈ దృశ్యాన్ని నెటిజన్లు ఆసక్తిగా పంచు కుంటూ, ప్రపంచంలోనే అత్యంత వయసున్న జీవిని భారత ప్రధాని కలవడం విశేషమని వ్యాఖ్యానిస్తున్నారు.

## బాలికను బలి.. (మొదటిపేజీ తరువాయి)

అనంతరం మాన్‌పూర్‌లోని సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్ కార్యాలయం సమీపంలో మరోసారి బ్యారికేడ్లు ఏర్పా టు చేశారు. కానీ అక్కడ కూడా డ్రైవర్ ట్రక్కును ఆపకుండా బ్యారికేడ్లను ఢీకొట్టి, వాటి ఇనుప భాగాలను ఈడ్చుకుంటూ పట్టణంలోకి ప్రవేశించాడు. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న పలువురు పోలీసులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ పోలీసులు వెనక్కి తగ్గకుం డా ట్రక్కును నిరంతరం వెంబడిస్తూ నిందితుడిని పట్టుకు నేందుకు చర్యలు కొనసాగించారు.దాదాపు 60 కిలోమీటర్ల పాటు సాగిన ఛేజింగ్‌కు చివరికి మహారాష్ట్ర సరిహద్దుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోర్కోట్టి గ్రామం సమీపంలో ముగింపు పలికింది. వేగాన్ని అదుపు చేయలేక ట్రక్కు రోడ్డుపక్కకు దూసుకెళ్లి ఆగిపోయింది. గాయపడిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా అతడు మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది.

# స్పీడు పెంచే దిశగా.. (మొదటిపేజీ తరువాయి)

ఈ రెండేళ్లలో కొన్ని స్కూళ్లనైనా గాడిలో పెట్టాలని, ఆ ఆవరణల్లోకి విద్యార్థులను తరలించాలని యోచిస్తోంది. దీనికోసం సమర్థులైన అధికారులకు బాధ్యతలు అప్పగించనుంది. ఇక ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మరో పథకం 'ఫ్యూచర్ సిటీ'. ఇప్పటికే 13,610ఎకరాలతో మాస్టర్ ప్లాన్‌ను సర్కారు విడుదల చేసింది. ఇందులో సెక్టార్ల వారీగా భూమిని కేటాయించాలని నిర్ణయించింది. లైఫ్ సైన్సెస్ హబ్ కు 4వేల ఎకరాలు, డేటా సిటీకి 1500 ఎకరాలు, రెసిడెన్షియల్ కాలనీలకు 2,477 ఎకరాలు కేటాయించనున్నట్లు ప్రకటించింది. గ్రీన్ ఫార్మా క్లస్టర్, ఏఐ సిటీ, యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ వంటి వాటికి ప్రాధాన్యమిస్తోంది. రానున్న ఎన్నికల నాటికి ఈ ప్రాజెక్టు ఫలితాలను ప్రజలకు చూపాలన్న దృఢ నిశ్చయంతో ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ ప్రాజెక్టు విషయంలో తీసుకుంటు న్న చర్యలు, ప్రగతి నివేదికలపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. ఇది రాజకీయంగా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చి పెడుతుందని భావిస్తున్నారు. ఇందులో భారీగా పె ట్టుబడులను సాధిస్తే.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని ఆశిస్తున్నారు. ప్రముఖ కంపెనీలు రావడంవల్ల యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నది ప్రభుత్వ యోచన.

**కొలిక్కివచ్చిన మెట్రోరైలు ప్రాజెక్టు..**
మెట్రో రైలు ప్రాజెక్టు కూడా దాదాపు కొలిక్కి వచ్చినట్లేనని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం జపాన్ సంస్థల నుంచి అందిన రూ.13,615 కోట్ల రుణం ప్రస్తుతం ఇండియన్ రైల్వే ఫైనా న్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) వద్ద ఇరుక్కుపోయింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కలిసి రావడాన్ని ప్రభుత్వం సానుకూలంగా మలుచుకోనుంది. ఐఆర్ఎఫ్‌సీ వద్ద ఉన్న రుణాన్ని సాధించుకునే దిశగా చర్యలు చేపట్టింది. ఈ రుణం అందితే.. మెట్రో రైలు రెండో దశ పనులను చేపట్టనుంది. ఇవి కాకుండా ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తోంది. ఇటీవలే రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో అన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక టి చొప్పున ఇలాంటి స్కూళ్లను ఏర్పాటు చేయాలన్న ది ప్రభుత్వ నిర్ణయం. ఇక ప్యారడైజ్ నుంచి మేడ్చ ల్, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట వరకు రెండు ఎలివేటెడ్ కారిడార్లను సర్కారు చేపడుతోంది. ఈ కారిడార్లకు అవసరమైన రక్షణ శాఖ భూముల విషయంలో ఇటీవలే కేంద్ర రక్షణ శాఖ అనుమతులిచ్చింది. మరోవైపు తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును చేపట్టడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ముంపు ప్రాంతాల విషయమై చర్చించడానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రికి రాష్ట్ర సీఎం రేవంత్ లేఖ కూడా రా శారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకోవాలని విన్నవించారు. పాలమూరు ప్రాజెక్టునూ గాడిలో పెట్టే చర్యలు చేపడుతున్నారు.

**కొత్త సీఎస్‌కు దిశా నిర్దేశం..**
పథకాల చివరి ఫలితాలను సాధించాలన్న కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వం.. వాటి అమలు బాధ్యతలను సమర్థ అధికారులకు అప్పగిస్తోంది. అందులో భాగంగానే కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఏరికోరి తెచ్చుకుంది. ఏదైనా పథకాన్ని ప్రారంభిస్తే.. దాని చివరి ఫలితం వచ్చేవరకు గట్టిగా అమలు చేసి తీరుతారని సంజయ్ జాజుకు పేరుంది. ఈ నెల 30 నుంచి చార్జి తీసుకున్న తర్వాత ప్రభుత్వం ఆయనను పూర్తి స్థాయిలో రంగంలోకి దించనుంది. ఇప్పటికే ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యాలను ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశం చేశారని తెలిసింది. పెట్టుబడులను ఆకర్షిం చే చర్యల్లో భాగంగా సంజయ్‌జాజు పాత్రను కూడా మరింత కీలకం చేశారు. ఇందుకోసం ఆయన కు సీఎస్ బాధ్యతలతో పాటు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రత్యేక ప్రధానకార్యదర్శి బాధ్యతలు కూడా అప్పగించారు. సీఎం కార్యాలయంలోని ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో, స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ(స్పీడ్) సీఈవో పోస్టులను కూడా ఆయనకే అప్పగించారు. మరోవైపు గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ఎన్.శ్రీధర్‌ను సీఎంవోలోకి తీసుకున్నారు. గతంలో సింగరేణి సీఎండీగా బాధ్యతలు నిర్వహించిన అనుభవం శ్రీధర్‌కు ఉండడంతో సీఎంవోలో ఆయన కీలక భూమిక పోషిస్తారని భా విస్తున్నారు. సీఎంవోలో ఉన్న అజిత్‌రెడ్డిని బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ విభాగం సీఈవోగా బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా పెట్టుబడులను ఆకర్షించడానికి కృషి చేస్తారని ప్రభుత్వం భావిస్తోంది.

# మీ భవిష్యత్తు నా బాధ్యత.. (మొదటిపేజీ తరువాయి)

అరెస్టులు లాంటి ఘటనల తరహాలోనే ఆ పార్టీ మోసాలూ ఉంటాయి. 'ఏ ప్రభుత్వం ఉంటే మాకేమిలే' అనే భావనతో మీరు ఉండొద్దు. ప్రజల జీవితాలను ఎలా విధ్వంసం చేయొచ్చో గత ప్రభు త్వం నిరూపించింది. రాష్ట్రానికి జీవనాడిలాంటి పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయేలా చేశారు. కానీ 2027 మార్చి నాటికి పోలవరం జాతికి అంకి తం చేసే లక్ష్యంతో మా ప్రభుత్వం పనులు చేస్తోం ది. ఇన్ని పనులు చేస్తున్న ప్రభుత్వాన్ని విస్మరించి కులం, మతం, పార్టీ అంటూ వైకుంఠపాళీ ఆట ఆడి, గొడ్డలి పార్టీ మాయలో పడొద్దు. మీ అభివృద్ధి చూసే బాధ్యత నాది. నాకు సహకరించే బాధ్యత మీది. నన్ను చూడండి. టీడీపీని చూడండి. ఎన్డీయేను చూ సి అండగా నిలబడండి. ప్రజలు ఆమోదించే వ్యక్తులనే వచ్చే ఎన్నికల్లో నేను ఎంపిక చేస్తాను. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తాం. ఆదరించండి."

### 30 ఏళ్ల ముందుచూపున్న వ్యక్తిని నేను

'నేనెప్పుడు కూడా 30 ఏళ్ల ముందుచూపుతో పనులు చేపడతాను. ఆనాడు హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్టు, ఇతర ప్రాజెక్ట్‌ల నిర్వాసితులు అక్కడ కొన్న ఆస్తులు ఈరోజు కోట్ల విలువకు చేరాయి. మార్కాపురం ప్రాంతానికి కృష్ణాజలాలు ఇవ్వాలనే ఆలోచన 1985లోనే ఎన్టీఆర్ చేశారు. 1995లో నేను ప్రకాశం పర్యటనకు వచ్చిన ప్రతిసారీ వెలిగొండ గురించే ప్రజలు అడిగేవారు. సక్రమంగా పనులు జరిగి ఉంటే 10 ఏళ్ల క్రితమే ఇది పూర్తయ్యేది. ప్రాజెక్ట్ రావడం ద్వారా వనరులు పెరుగుతాయి. ఇటీవల తుంగభద్ర డ్యాంకు గేట్లు పెట్టేందుకు సహకరించా. ఈ సీజన్ కాపాడాం. నదుల అనుసంధానంతో పాటు భూగర్భజలాలను పెంచాలి. అందుకే జలధార కార్యక్రమం ప్రారంభించాం. లక్ష కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్ ద్వారా మార్కాపురం ప్రజలకు మేలు చేస్తాం."

### నిర్వాసితుల్లో ఒక్కొక్కరిదీ ఓ దీనగాథ

'వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు తరతరాల నివాసాలను వదిలి, భూములను త్యాగం చేశారు. వారి కుటుంబాల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ. పుట్టిన ఊరు నుంచి వెళ్లిపోవాలంటే ఎవరికైనా బాధ కలుగుతుంది. ఏ ఒక్క నిర్వాసిత కుటుంబం నష్టపోకుండా వెలిగొండ పూర్తి చేస్తా. ఇది నా గ్యారెంటీ. ప్రాజెక్ట్ ద్వారా లబ్ధి పొందే ప్రజలే కాకుండా నిర్వాసితులు కూడా ఆనందంగా ఉండేలా చూసే బాధ్యత ప్రభుత్వానిది. నిర్వాసితుల కోసం కాలనీలను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని విధాలా మార్కాపురం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాది. నాకు అండగా నిలవండి." అని చంద్రబాబు కోరారు. దానికి ముందు.. వెలిగొండ ఫీడర్ కాలువ పనులను ఆయన పరిశీలించారు. గడువులోపు పనులు పూర్తి చేయకపోతే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు నిమ్మల, గొట్టిపాటి, డోలా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## తమిళనాడు కాంగ్రెస్‌కు..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాణిక్యం ఠాగూర్ నియామకాన్ని స్వాగతించారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ జిల్లాల నుంచి నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. తమిళనాడు రాజకీయాల్లో కాంగ్రెస్ పాత్రను మరింత విస్తరించే లక్ష్యంతో ఈ మార్పు చేపట్టినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న కాలంలో పార్టీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణ, ప్రజా సమస్యలపై ఉద్యమాలకు కొత్త అధ్యక్షుడు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు.

# సౌదీ ప్రయాణికులకు కొత్త నిబంధనలు

- డిక్లరేషన్ పరిమితి తగ్గింపు
- బంగారం రవాణాపై కఠిన నిబంధనలు
- ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు



**హైదరాబాద్, జూన్ 27**
సౌదీ అరేబియాకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆ దేశ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను అమలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చర్యల్లో భాగంగా నగదు, బంగారం, ఆభరణాలు, విలువైన లోహాలు, రత్నాల రవాణాపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో అమల్లో ఉన్న 60 వేల సౌదీ రియాల్స్ డిక్లరేషన్ పరిమితిని 40 వేల సౌదీ రియాల్స్‌కు తగ్గించింది. కొత్త నిబంధనల ప్రకారం 40 వేల సౌదీ రియాల్స్ లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదు, బంగారం, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలను వెంట తీసుకెళ్లే ప్రతి ప్రయాణికుడు కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. ఆయా వస్తువులకు సంబంధించిన కొనుగోలు బిల్లులు లేదా ఇన్‌వాయిస్‌లను కూడా సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సౌదీ అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన వివరాలు వెల్లడించకపోతే సంబంధిత వస్తువులను 72 గంటల పాటు తాత్కాలికంగా స్వాధీనం చేసుకుంటారు. అనంతరం విచారణ ఆధారంగా తదుపరి చర్యలు చేపడతారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన వారిలో మనీలాండరింగ్ ఉద్దేశం లేదని తేలితే స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువలో 10 నుంచి 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. అదే తప్పిదం మళ్లీ చేస్తే జరిమానాను 50 శాతం వరకు పెంచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఒకవేళ నేరపూరిత ఉద్దేశం ఉన్నట్లు అనుమానిస్తే కేసును నేరుగా పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేస్తారు. దీంతో చట్టపరమైన చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అందువల్ల ప్రయాణికులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కొత్త నిబంధనలు భారత్‌తో పాటు గల్ఫ్ దేశాలకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రవాసులపై ప్రభావం చూపనున్నాయి. ప్రయాణికులు తమ వెంట తీసుకెళ్లే విలువైన వస్తువులకు సంబంధించిన అసలు రశీదులను భద్రపరచుకోవడంతో పాటు, ప్రయాణానికి ముందు తాజా కస్టమ్స్ నిబంధనలను తెలుసుకుని ప్రయాణించాలని అధికారులు సూచించారు.

# చినుకుల్లోనే ప్రగతి పనులు

- రూ.16.13 కోట్ల శంకుస్థాపనలు
- తండాలకు మెరుగైన రహదారులు- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, జూన్ 27**
వర్షపు చినుకులు కురుస్తున్నా అభివృద్ధి పనులు ఆగవని చాటిచెబుతూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూసుమంచి మండలంలో రూ.16.13 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని దుబ్బతండా, లాల్‌సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వర్షం పడుతున్నా ప్రజల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఎట్టి పరిస్థితు ల్లోనూ ఆగవని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకా లంలో తండాలు, గ్రామాల ప్రజలు బురద రోడ్లు, వాగుల ఉద్ధృతి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోకు ండా ఉండేందుకు రహదారులు, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు–గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ.2.10 కోట్లతో, జడ్పీ రోడ్డు నుంచి కొత్తూరు–ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ.4.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ రహదారులు పూర్తయితే తండాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. అలాగే లాల్‌సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ.2.03 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో కొండాపురం–మోటాపురం ప్రధాన రహ దారిపై రూ.7.50 కోట్ల వ్యయంతో నిర్మించ నున్న రెండు వంతెనల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వర్షాకా లంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని అధికారులు తెలిపారు.నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజాధనంతో చేపట్టే ప్రతి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

- లబ్ధిదారులకు గృహ ప్రవేశం
- మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం
- నూతన వస్త్రాల పంపిణీ



**ఆదిలాబాద్, జూన్ 27**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాలను శనివారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఆదిలాబాద్ పట్టణంలోని 23వ వార్డు తాటిగూడలో లబ్ధిదారులు డోమటి లావణ్య, వాంఖడే తానుబాయి-మాధవ్ దంపతులు నిర్మించుకున్న నూతన గృహాలను మంత్రులు ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వారికి భద్రమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. గృహ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి మరిన్ని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని అధికారులు పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ ప్రక్రియలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కల నెరవేరుతోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# వరదలపై ముందస్తు సన్నద్ధత

- శాఖలన్నీ అప్రమత్తంగా ఉండాలి
- పుష్కరాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లాను సుందరంగా తీర్చిదిద్దాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27**

గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పూర్తిస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, గోదావరి వరదల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి వరదల సన్నద్ధత సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వరదల సన్నద్ధతలో భాగంగా జిల్లా, మండల స్థాయిలో అత్యవసర నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలు, త్వరిత స్పందన బృందాలు, వైద్య సేవలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ సేవలు, విపత్తు స్పందన బృందాలతో సమన్వయ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు ఇతర శాఖలతో సమన్వయంగా సహాయక చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వరదలతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపింగ్ మోటార్లు, పడవలు, అత్యవసర పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని, రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు ముందుగానే కల్పించాలని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. భద్రాచలం-కూనవరం కరకట్ట నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు సారపాక ఐటీసీ ఈస్ట్ గేట్ వద్ద జాతీయ రహదారి ఎత్తు పెంపుపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో ప్రజలకు నిరంతరం సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయాలని కూడా సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, మేయర్ మూడ్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ ఆరోపణలతో తమిళనాడు మంత్రి చుట్టూ వివాదం

- ఐపీఎల్ పాత వీడియో వైరల్‌తో రాజకీయ దుమారం
- డ్రగ్స్ కాదని.. కుమార్తె కోసం మాత్రను పొడి చేశానన్న మంత్రి
- రాజీనామా డిమాండ్లు.. ఆరోపణలకు ఆధారాలు లేవన్న వివరణ



**చెన్నై, జూన్ 27**

తమిళనాడులో అధికార టీవీకే ప్రభుత్వంలోని మానవ వనరుల శాఖ మంత్రి డీ శరత్‌కుమార్‌కు సంబంధించిన పాత వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయంగా తీవ్ర చర్చ మొదలైంది. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా స్టేడియంలో చిత్రీకరించిన ఆ వీడియోలో మంత్రి ఒక మొబైల్ ఫోన్ స్క్రీన్‌పై తెల్లటి పొడి వంటి పదార్థాన్ని ఏటీఎం కార్డు, రూ.500 నోటు సహాయంతో సరిచేస్తున్నట్లు కనిపించడం వివాదానికి దారితీసింది. ఈ దృశ్యాలను ఆధారంగా చేసుకుని ఆయన డ్రగ్స్ వినియోగించారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం సాగింది. ఈ వ్యవహారం కొద్ది గంటల్లోనే రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వీడియో వైరల్ కావడంతో ప్రతిపక్ష నాయకులు, పలువురు సామాజిక కార్యకర్తలు మంత్రి వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనపై ప్రచారం చేస్తూనే, మంత్రిపై ఇలాంటి ఆరోపణలు రావడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని వారు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి విజయ్ ఇటీవల నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత క్రీడలను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అదే కార్యక్రమంలో మంత్రి శరత్‌కుమార్ కూడా పాల్గొనడం చర్చకు మరో కారణమైంది. ఈ ఆరోపణలపై మంత్రి శరత్‌కుమార్ వెంటనే స్పందించారు. తన భార్య, కుమార్తెతో కలిసి వీడియో ప్రకటన విడుదల చేసి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని పూర్తిగా ఖండించారు. వైరల్ అవుతున్న వీడియో రెండేళ్ల క్రితం తీసినదేనని, అందులో కనిపిస్తున్నది ఎలాంటి మాదకద్రవ్యం కాదని స్పష్టం చేశారు. వాస్తవాలను వక్రీకరించి తన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రజలు నిరాధార ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. వీడియోలో కనిపిస్తున్న తెల్లటి పొడి గురించి కూడా మంత్రి వివరణ ఇచ్చారు. తన చిన్న కుమార్తెకు మందు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని, అయితే ఆమె మాత్రను నేరుగా మింగలేకపోవడంతో దానిని పొడి చేసి నీటిలో కలిపి ఇవ్వాలని తన భార్య కోరిందన్నారు. అదే సమయంలో స్టేడియంలో ఆ మాత్రను పొడి చేశానని తెలిపారు. వీడియోలో కనిపిస్తున్నది అదే ఘటన మాత్రమేనని, దానిని డ్రగ్స్‌తో ముడిపెట్టడం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన సాధారణ విషయాన్ని ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. స్టేడియంలో వేలాది మంది ప్రేక్షకులు, భద్రతా సిబ్బంది, పోలీసులు, కెమెరాల పర్యవేక్షణ మధ్య తాను డ్రగ్స్ వినియోగించడం అసాధ్యమని మంత్రి అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఎవరు కూడా బహిరంగంగా చట్టవిరుద్ధమైన పని చేయరని పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా ఒక వీడియోను చూసి ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మడం వల్ల వ్యక్తుల ప్రతిష్ఠ దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వివాదం తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# లంబాడీలకు కాంగ్రెస్ అండ

- స్వర్ణోత్సవ బస్సు యాత్ర
- గిరిజన సంక్షేమమే లక్ష్యం
- చారిత్రక నిర్ణయాలు గుర్తుచేసిన మంత్రి



**కొల్లాపూర్, జూన్ 27**

లంబాడీలకు షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ బస్సు యాత్రలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. కొల్లాపూర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బస్సు యాత్రలో పాల్గొని గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ తీసుకున్న చారిత్రక నిర్ణయాలను గుర్తు చేశారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1976లో ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఆర్డర్స్ సవరణ చట్టం ద్వారా లంబాడి, ఎరుకల, యానాది తదితర వర్గాలకు షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించిందని తెలిపారు. ఆ నిర్ణయం వల్ల వేలాది మంది గిరిజన యువత విద్య, ఉద్యోగాలు, ప్రజా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం లభించిందని అన్నారు. గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయని మంత్రి పేర్కొన్నారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన గిరిజన పంచశీల సిద్ధాంతాన్ని అనుసరిస్తూ ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ హయాంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు భూమిపై చట్టబద్ధ హక్కులు కల్పించిందని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని జూపల్లి కృష్ణారావు చెప్పారు. తండాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు గురుకుల విద్య, హాస్టళ్లు, విద్యార్థులకు ఉపకార వేతనాల ద్వారా మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్వర్ణోత్సవ బస్సు యాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ పోరాటాన్ని భావితరాలకు తెలియజేయడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులోనూ కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గిరిజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్లాట్ ఆలస్యమైతే.. బిల్డర్ చెల్లించాల్సిందే!

- గృహ కొనుగోలుదారుల హక్కులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఫ్లాట్ స్వీకరించినా నష్టపరిహారం కోరే హక్కు ఉంటుందని స్పష్టీకరణ
- వినియోగదారుల రక్షణ చట్టానికే ప్రాధాన్యం..

ఏడాదిలోగా కేసు పరిష్కరించాలని ఆదేశం

**న్యూఢిల్లీ, జూన్ 27**

దేశవ్యాప్తంగా లక్షలాది మంది గృహ కొనుగోలుదారులకు ఊరటనిచ్చే కీలక తీర్పును సుప్రీంకోర్టు వెలువరించింది. ఫ్లాట్ నిర్మాణం లేదా అప్పగింతలో బిల్డర్ జాప్యం చేస్తే, అనంతరం కొనుగోలుదారు ఫ్లాట్‌ను స్వీకరించినప్పటికీ ఆ ఆలస్యానికి సంబంధించిన నష్టపరిహారం కోరే హక్కు కోల్పోరని స్పష్టంగా తేల్చిచెప్పింది. ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకోవడం అంటే బిల్డర్ చేసిన జాప్యాన్ని అంగీకరించినట్లుగా భావించరాదని పేర్కొంది. ఈ తీర్పు రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల హక్కులను మరింత బలోపేతం చేసే నిర్ణయంగా నిలిచింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 2016లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టి, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసును పునర్విచారణకు స్వీకరించింది. నిర్మాణ జాప్యం వల్ల కొనుగోలుదారుడు అనుభవించిన ఇబ్బందులకు పరిహారం చెల్లించే బాధ్యత బిల్డర్‌పైనే ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఫ్లాట్ అప్పగింత అనంతరం కూడా ఆ హక్కు కొనసాగుతుందని, వినియోగదారులు తమ చట్టబద్ధమైన హక్కులను కోల్పోరని పేర్కొంది. ఈ తీర్పు ఢిల్లీకి చెందిన టీకేఏ పద్మనాభన్ దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా వెలువడింది. ఆయన 2005లో అభియాన్ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీపై ఫ్లాట్ అప్పగింతలో తీవ్ర జాప్యం జరిగిందని ఆరోపిస్తూ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. అయితే ఒప్పందంలో ఉన్న మధ్యవర్తిత్వ నిబంధనను ఆధారంగా తీసుకుని కింది కోర్టులు కేసును ఆర్బిట్రేషన్‌కు పంపించాయి. దీనిని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒప్పందంలో మధ్యవర్తిత్వ నిబంధన ఉందనే కారణంతో వినియోగదారుల ఫోరంను ఆశ్రయించే హక్కును నిరాకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వినియోగదారుల రక్షణ చట్టం--1986 ప్రత్యేక చట్టమని, ఇది ప్రజలకు అదనపు న్యాయరక్షణ కల్పిస్తుందని పేర్కొంది. ప్రైవేటు ఒప్పందాలు లేదా మధ్యవర్తిత్వ నిబంధనలు వినియోగదారుల చట్టబద్ధ హక్కులను హరించలేవని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ వ్యాఖ్యలు భవిష్యత్తులో ఇలాంటి కేసులకు మార్గదర్శకంగా నిలవనున్నాయి. ఈ కేసును తిరిగి ద్వారక జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార ఫోరంకు పంపించిన సుప్రీంకోర్టు, విచారణను ఏడాది లోపే పూర్తి చేయాలని ఆదేశించింది. కేసు విచారణలో నిర్మాణ జాప్యం వల్ల కొనుగోలుదారుడు ఎదుర్కొన్న ఆర్థిక, మానసిక నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకుని చట్టప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది.



## అతనికే అప్పగించండి!

సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే తారల్లో శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ ముందు వరుసలో ఉంటుంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ముద్దుగుమ్మ పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పింక్ కలర్ నైట్ సూట్‌లో ఉన్న ఓ ఫొటోని ఇన్‌స్టాలో పోస్ట్ చేసి, దాని కింద.. 'ఒకవేళ నేను తప్పిపోతే.. దయచేసి శిఖర్ పహారియాకు నన్ను అప్పగించండి' అంటూ ఓ చమత్కారమైన సందేశాన్ని పొందుపరిచింది జాన్వీ. ప్రస్తుతం ఈ పోస్ట్‌పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'ఎంతో ముద్దుగా ఉంది' అంటూ ఒకరు కామెంట్ చేస్తే, 'రిలేషన్‌షిప్ గోల్స్' అంటూ మరొకరు అభినందించారు.జాన్వీ, శిఖర్ పహారియా గత కొంతకాలంగా రిలేషన్‌లో ఉన్న విషయం విదితమే. అయితే, ఈ బంధాన్ని అధికారికంగా మాత్రం వారు ధృవీకరించలేదు. గతంలో 'శిఖర్' అనే పేరున్న నెక్లెస్‌ని జాన్వీ ధరించి కనిపించడం, శిఖర్ కూడా జాన్వీ నటించిన సినిమాలను సోషల్ మీడియా వేదికగా ప్రశంసించడం, వీటితోపాటు గత ఏడాది జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జాన్వీతో కలిసి శిఖర్ కూడా సందడి చేయడం.. ఇవన్నీ వీరి రిలేషన్ రూమర్స్‌కి బలాన్ని చేకూర్చాయి. జాన్వీ రీసెంట్ పోస్ట్‌తో అది రూఢీ అయ్యింది.

## అక్టోబర్‌లో 'ఆదర్శకుటుంబం'



అగ్ర కథానాయకుడు వెంకటేష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఆదర్శకుటుంబం హౌస్ నెం: 47'. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఈ సినిమాను అక్టోబర్ 2న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాయకానాయికలు వెంకటేష్, శ్రీనిధి వారి కుటుంబంతో కలిసి ఆనందంగా కనిపిస్తున్నారు. వినోదం, హృదయానికి హత్తుకునే భావోద్వేగాల కలబోతగా రూపొందిస్తున్న సకుటుంబ కథా చిత్రమిదని, త్రివిక్రమ్ శైలి హాస్యం, అర్థవంతమైన కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని చిత్రబృందం పేర్కొన్నది. ఈ చిత్రానికి కెమెరా: రవి కె చంద్రన్, సంగీతం: తమన్, నిర్మాత: ఎస్.రాధాకృష్ణ (చినబాబు), రచన-దర్శకత్వం: త్రివిక్రమ్.

## ఈ పులులు పైలమేనా!?

తారాగణం: ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్యకృష్ణ, వెన్నెల కిషోర్, సీరత్ కపూర్, జోర్దార్ సుజాత, పావని గంగిరెడ్డి తదితరులు దర్శకత్వం: శ్రీరామ్

కుటుంబ కథలు అనగానే.. కష్టాలు, కన్నీళ్లే కళ్లముందు కదలాడుతాయి. అయితే, వెండితెరపై కామెడీని పండించిన ఫ్యామిలీ స్టోరీలూ ఉన్నాయి. భార్యాభర్తల మధ్య జరిగే చిన్నచిన్న గొడవల్ని సరదాగా చూపించాయి. ప్రేక్షకుల మోముపై నవ్వులు పూయించడంతోపాటు ఫ్యామిలీలో సర్దుకుపోవడాలు, కుటుంబ విలువలనూ నేర్పించాయి. ఇలాంటి కుటుంబ నేపథ్యంలో వచ్చిన తెలుగు వెబ్‌సిరీస్.. సేవ్ ద టైగర్స్. ఇప్పటికే వచ్చిన రెండు సీజన్లు ప్రేక్షకులను బాగానే అలరించాయి. ఇటీవలే జియో హాట్‌స్టార్ వేదికగా.. మూడో సీజన్ కూడా విడుదలైంది. రికార్డ్ స్ట్రీమింగ్‌తో దూసుకెళ్తున్నది. కథలోకి వెళ్తే.. మొదటి సీజన్‌లో మొదలైన గంటా రవి, విక్రమ్, రాహుల్ స్నేహంతోపాటు.. వారి జీవితాల్లో అశాంతి, అసహనం కొనసాగుతూనే ఉంటుంది. ఎమ్మెల్యే కావాలనే ఆశతో ఎన్నికల్లో పోటీచేసి, ఆస్తులన్నీ పోగొట్టుకుంటాడు గంటా రవి (ప్రియదర్శి). భార్య హైమా (జోర్దార్ సుజాత) పోరు పడలేక బస్తీ నుంచి గేటెడ్ కమ్యూనిటీకి మారుతాడు.

## 'నాగబంధం' రథయాత్ర చాలా ప్రత్యేకం!



సాఫ్ట్‌వేర్ రంగంలో విజయవంతంగా రాణించిన కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి దంపతులు 'నాగబంధం' చిత్రం ద్వారా సినీ నిర్మాతలుగా అరంగేట్రం చేస్తున్నారు. కేవలం డబ్బుకోసమే ఇండస్ట్రీకి రాలేదని, ఐటీ ఫీల్డ్‌లో తాము కావాల్సినంత గుర్తింపు పొందామని, వ్యాపారాన్ని విస్తరించే క్రమంలో సినిమా గొప్ప వేదికగా కనిపించిందని వారు చెప్పారు. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన డివైన్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం' జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి శనివారం పాత్రికేయులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. మేమిద్దరం ఐఐటీ గ్రాడ్యుయేట్స్. ఐటీ నుంచి వచ్చినా...క్రియేటివ్ ఫీల్డ్ అయిన సినిమాపై తొలి నుంచి ఆసక్తి ఉంది. నిర్మాత రవీందర్ రెడ్డి ద్వారా దర్శకుడు అభిషేక్ నామాను కలిసి కథ విన్నాం. ఆయన విజన్ బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరయ్యాం. కథపై ఉన్న నమ్మకంతో 110కోట్ల బడ్జెట్‌తో సినిమా తీశాం.రెండు కాలల నేపథ్యంలో నడిచే పీరియాడిక్ సినిమా ఇది. విజువల్స్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. భారీ సెట్స్‌లో చిత్రీకరణ జరిపాం. ప్రతీ పదినిమిషాలకొక అద్భుతమైన విజువల్ తెరపై కనిపిస్తుంది. ఈ సినిమా కోసం వేసిన పద్మనాభస్వామి ఆలయం సెట్‌ని చూసిన అందరూ నిజమైన ఆలయానికి వచ్చిన అనుభూతి కలిగిందని చెప్పారు. ఈ సినిమా ప్రమోషన్స్‌ని కూడా వినూత్నంగా నిర్వహించాం. పద్మనాభస్వామి రథయాత్ర రూపంలో చేసిన ప్రచార కార్యక్రమాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇది చాలా ప్రత్యేకమని, ఈ తరహా ప్రమోషన్ ఎవరూ చేయలేదనే ప్రశంసలొచ్చాయి. ఈ పాన్ ఇండియా సినిమాకు అన్ని భాషల నుంచి అద్భుతమైన స్పందన వస్తున్నది. బాలీవుడ్ విశ్లేషకులు ట్రైలర్ చూసి ప్రామిసింగ్‌గా ఉందని చెప్పారు. సినిమా ఆశించిన విజయం సాధిస్తే తప్పకుండా సీక్వెల్ తెరకెక్కిస్తాం. ఈ సినిమా విడుదలైన తర్వాత కొత్త కథలు వింటాం.

## 'రాకా'లో రష్మిక?

'పుష్ప' ఫ్రాంఛైజీలో పుష్పరాజ్, శ్రీవల్లి జోడీ ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ఇద్దరు మరోమారు వెండితెరపై సందడిచేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ 'రాకా' రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇందులో దీపికా పడుకోన్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమాలో మరో నాయికకు చోటుందని, కథాగమనంలో ఆమెది అత్యంత కీలకమైన పాత్ర అని చెబుతున్నారు. ఈ క్యారెక్టర్ కోసం రష్మిక మందన్నను ఎంపిక చేశారని ప్రచారం జరుగుతున్నది. మానవాతీత శక్తులు కలిగిన యువతిగా ఆమె పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని అంటున్నారు. అయితే ఈ విషయంలో చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో రష్మికతో పాటు మృణా ల్ ఠాకూర్, జాన్వీకపూర్ కూడా కీలక పాత్రల్ని పోషించబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. సన్‌పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకురానుంది.

